క్లుప్తంగా

ఫర్టిలైజర్ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు


పురుగు మందుల షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

కదిరి అర్బన్: డివిజన్ పరిధిలోని తలుపుల, ఎన్పీ కుంట మండలాల్లో ఉన్న ఎరువులు, పురుగు మందుల (ఫర్టిలైజర్స్) దుకాణాల్లో సోమవారం విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు తనిఖీ చేశారు. ఇందులో భాగంగా తలుపుల మండలంలో 98.687 మెట్రిక్ టన్నులకు గాను రూ.32,25,655 విలువగల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఎన్పీకుంట మండలంలో 6.65 మెట్రిక్ టన్నులకు గాను రూ.5,52,450 విలువ గల ఎరువుల అమ్మకం నిలుపుదల చేశారు. ఎరువులు, పురుగు మందుల షాపుల యజమానులు తప్పనిసరిగా లైసెన్స్ పొంది ఉండాలన్నారు. స్టాక్ రిజిష్టర్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. రైతులకు కొనుగోళ్లకు సంబంధించి వివరాలతో కూడిన రసీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఈ తనిఖీల్లో ఏడీఏ సనావుల్లా, విజిలెన్స్ సీఐలు శివన్న, శివకుమార్, ఏఓలు శ్రీహరినాయక్, లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వన్నూరుస్వామి పీరు ఊరేగింపు



కదిరి అర్బన్: కాళసముద్రం మొహర్రం ఉత్సవాల్లో భాగంగా సోమవారం వన్నూరుస్వామి పీరు ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని చక్కెర చదింపులు చేయించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కనగానపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అనిల్ కుమార్ తెలిపారు. ఎంపీపీ భాగ్యమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులతో పాటు స్థానిక సర్పంచులు, మండల స్థాయి అధికారులంతా తప్పక హాజరుకావాలని సూచించారు.

విరబూసిన బ్రహ్మకమలం



చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో నివాసం ఉంటున్న మేడా వసుంధర, మేడా రాధాక్రిష్ణ పెరట్లో సోమవారం రాత్రి బ్రహ్మకమలం విరబూసింది. బ్రహ్మకమలానికి పూజలు చేశారు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు పుష్పాన్ని తిలకించేందుకు తరలివచ్చారు.

బీమా ప్రీమియం చెల్లింపునకు నేడు ఆఖరు

ధర్మవరం రూరల్: బత్తాయి, వేరుశనగ, దానిమ్మ, పత్తి, టమాట పంటలకు వాతావరణ ఆధారిత పంటల బీమా ప్రీమియం చెల్లించడానికి మంగళవారం ఆఖరు రోజు అని ఏడీఏ లక్ష్మానాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ బత్తాయికి ఎకరాకు రూ.2,783, వేరుశనగకు రూ.648, దానిమ్మకు రూ.3,796, పత్తికి రూ.1,923, టమాటకు రూ.1,619 చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

అక్రమ కట్టడాల తొలగింపు


ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: ఓ మహిళ స్థలంలో అక్రమంగా చేపట్టిన కట్టడాలను తొలగించినట్లు ఆర్డీఓ మహేష్ తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ రామగిరి మండలం గంతిమర్రికి చెందిన పోలేరమ్మ నివాసానికి ఆనుకుని ఉన్న కొంతమంది వ్యక్తులు ఆమె స్థలంలో అనధికారికంగా కాంపౌండ్, మెట్లు, ఎలక్ట్రికల్ వైర్లను ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయమై బాధితురాలు ఆరేళ్ల నుంచి సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందిస్తూ వస్తున్నారు. చివరికి కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు గంతిమర్రిలో పర్యటించారు. పోలేరమ్మ స్థలాన్ని ఆక్రమించి కాంపౌండ్, మెట్లు, ఎలక్ట్రికల్ తీగలు ఏర్పాటు చేశారని విచారణలో నిర్ధారించి, వాటిని తొలగించారని ఆర్డీఓ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి వివాదాలు మళ్లీ తలెత్తకుండా ఉండేందుకు అధికారులతో స్థలాన్ని కొలతలు వేసి, హద్దులు ఏర్పాటు చేయించామన్నారు.



కదిరి, తనకల్లులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న పార్లమెంట్ పరిశీలకుడు రమేష్‌రెడ్డి, సమన్వయకర్త మక్బూల్ అహ్మద్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే చాంద్‌బాషా, నాయకులు పూల శ్రీనివాసరెడ్డి లింగాల లోకేశ్వర్‌రెడ్డి తదితరులు

ఇంటింటికీ బాబు మోసాలు

- రెడ్‌బుక్ అరాచకాలూ వివరిద్దాం
- విస్తృతంగా 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'
- వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో పార్లమెంట్ పరిశీలకుడు రమేశ్‌రెడ్డి


ఎన్పీ కుంటలో మాట్లాడుతున్న సమన్వయకర్త మక్బూల్ అహ్మద్

తనకల్లు: హామీలు అమలు చేయకుండా ప్రజలకు చంద్రబాబు చేసిన మోసాలను ఇంటింటికీ వివరించాలని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రమేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. తనకల్లులోని ఎస్‌ఎంఎన్ ఫంక్షన్ హాలులో సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో లెక్కకు మించిన హామీలు ఇచ్చి.. అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేశారని విమర్శించారు. ఆయన రాజకీయ జీవితమంతా అబద్ధాలతోనే సాగిందని ఎద్దేవా చేశారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, 20 లక్షల ఉద్యోగాల కల్పన, మహిళలకు ఉచిత బస్సు హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. 14 నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. రెడ్‌బుక్ రాజ్యాంగం మాటున రాష్ట్రంలో అరాచకాలకు పాల్పడుతున్నారన్నారు. అరాచకాలు, దౌర్జన్యాలు, దాడుల గురించి కూడా ప్రజలకు సవివరంగా వివరించాలన్నారు. 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయించి పథకాల అమలు కాక ఎంతమేర మోసపోయారో వివరించి ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వర్ రెడ్డి, మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి, మహిళా కన్వీనర్ విజయలక్ష్మి, సర్పంచులు శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, సుకుమార్‌రెడ్డి, ఎంపీటీసీ హిమధర్‌రెడ్డి, పలువురు వార్డు సభ్యులు, మండల కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

పేర్లు మార్చి.. ప్రజలను ఏమార్చి..

కదిరి టౌన్ : గత ప్రభుత్వంలో ఉన్న పథకాలకు పేర్లు మార్చి తామే కొత్తగా ప్రవేశపెట్టినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను ఏమార్చారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ విమర్శించారు. హామీలు ఇవ్వడం.. అమలు చేయకుండా మోసం చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా సోమవారం కదిరిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం మండల కన్వీనర్ మణికంఠనాయక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమన్వయకర్తతో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మక్బూల్ అహ్మద్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ తూచ తప్పకుండా అమలు చేశారని గుర్తు చేశారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఆయన పనిచేశారని కొనియాడారు. జగన్ పర్యటలనకు ప్రజల నుంచి విశేషమైన ఆదరణ వస్తుండటం చూసి కూటమి నేతలకు దడ పట్టుకుందన్నారు. చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. అమ్మ ఒడి పథకం పేరును 'తల్లికి వందనం' అని మార్చారని, అయితే ఈ పథకం విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆలోచనల నుంచి పుట్టుకొచ్చినదని నిస్సిగ్గుగా కొత్తచెరువు పర్యటనలో చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సూపర్ సిక్స్ సహా ఎన్నికల హామీల్లో రెండు, మూడు తప్ప మిగతావి అమలు చేయలేదన్నారు. ఇక యోగాంధ్ర పేరుతో రూ.500 కోట్ల ప్రజాధనం ఖర్చు చేసేశారన్నారు. అనంతరం పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన న్యాయవాది లింగాల లోకేశ్వర్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, కదిరి మండల నాయకుడు రవికుమార్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ లింగాల మధుసూదన్‌రెడ్డి, కొండమనాయుని పాళ్యం సర్పంచ్ రాఘవేంద్ర, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు గుర్తు చేద్దాం

గాండ్లపెంట : చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ ఎలా వంచనకు గురిచేశారో 'క్యూఆర్ కోడ్' ద్వారా ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ పిలుపునిచ్చారు. ఎన్పీ కుంట మండల కేంద్రంలోని శివాలయం వద్ద పార్టీ మండల కన్వీనర్ కొత్త రంగారెడ్డి అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ సమన్వకర్త మక్బూల్ అహ్మద్, రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వరరెడ్డి పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలు అమలుకు నోచుకోలేదని ప్రజలకు వివరించాలన్నారు. సంక్షేమ పథకాలు అందకుండా కొర్రీలు.. కోతలు ఎలా పెడుతున్నారో తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ సంస్థల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'బాబును నమ్మితే నట్టేట ముంచేస్తారు'

తాడిమర్రి: ఎన్నికల సమయంలో అలవిగాని హామీలు ఇచ్చే చంద్రబాబును నమ్మితే ప్రజలను నట్టేట ముంచుతూనే ఉంటారని వైఎస్సార్‌సీపీ నేత, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. ధర్మవరంలో సోవామరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమానికి తాడిమర్రి మండలంలోని చిల్లకొండయ్యపల్లి, పెద్దకోట్ల, ఎం.అగ్రహారం, పూలఓబయ్యపల్లి, పిన్నదరి, పుల్లానారాయణపల్లి, కునుకుంట్ల, రామాపురం, నిడిగల్లు, నార్సింపల్లి, చిల్లవారిపల్లి తదితర గ్రామాల నుంచి వందలాది మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన తరలి వెళ్లారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు రుణమాఫీ, మహిళలకు వడ్డీలేని రుణాలు, పేదలకు పక్కా ఇళ్లు తదితర పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి.. అధికారంలోకి రాగానే వాటిని తుంగలో తొక్కారని గుర్తు చేశారు. 2024 ఎన్నికల సమయంలోనూ మహిళలకు నెలకు రూ.1500, అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20వేల పెట్టుబడి సాయం, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ తదితర పథకాలతో ప్రజలను ఆకట్టుకుని అమలు చేయకుండా వంచించారని మండిపడ్డారు. ఇలా నమ్ముకుంటూ పోతే ముంచుతూనే ఉంటారని.. ఇకనైనా ప్రజలు చైతన్యవంతులై వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ పార్నాళ్ల విజయభాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు జొల్లిరెడ్డి అశ్వత్థ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజినేయులు, యువజన మండల అధ్యక్షుడు సిద్దే మోహన్‌రెడ్డి, సల్లాపురం బారమణారెడ్డి, మల్లప్పగారి మాధవరెడ్డి, ధర్మవరం నియోజకవర్గం బీసీసెల్ అధ్యక్షులు కుంటాల పుల్లయ్య, పాటిల్ ప్రకాష్‌రెడ్డి, అల్లే సాయినాథ్‌రెడ్డి, గుజ్జల హనుమంతు, కొండారుపల్లి విశ్వనాథ్, పిట్టు పరమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి


సమన్వయకర్తను సన్మానిస్తున్న ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు

కదిరి టౌన్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఎస్సీ సెల్ నాయకులకు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ పిలుపునిచ్చారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.నరసింహమూర్తి సోమవారం సమన్వయకర్తను కదిరిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ మండల, నియోజకవర్గ జిల్లా కమిటీల నియామకాల గురించి సమన్వయకర్త చర్చించారు. అందరూ కలసికట్టుగా పనిచేసి పార్టీని వచ్చే ఎన్నికల్లో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్పెంటర్ కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నల్లమాడ: యర్రవంకపల్లి ఎస్సీ కాలనీకి చెందిన కార్పెంటర్ నరసింహులు(55) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణ, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పారకల రమణ, యర్రవంకపల్లి, వేళ్లమద్ది సర్పంచ్‌లు రజనీకాంత్‌రెడ్డి, బొజ్జేనాయక్, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు ఇ.జయమ్మ తదితరులు నరసింహులు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్పెంటర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రాజారెడ్డి, జయదేవరెడ్డి, చెన్నారెడ్డి, రమణ, రామునాయక్, గణేష్‌నాయక్, లక్ష్మినారాయణ రామాంజి పాల్గొన్నారు.



కూలడానికి సిద్ధంగా 11 కేవీ విద్యుత్ స్తంభం

తలుపుల : మండల కేంద్రం తలుపుల– గండి రోడ్డుపై పొలిమేర గంగమ్మ గుడి సమీపంలో గత కొంత కాలంగా 11 కేవీ విద్యుత్ లైన్ స్తంభం కూలడానికి సిద్ధంగా ఉంది. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీతో ఉండే రోడ్డు పక్కన విద్యుత్ లైన్ స్తంభం ఇలా ఉండటంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులకు తెలిపినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక నైనా అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని మార్చి ప్రజలను ప్రాణాపాయం నుంచి రక్షించాలని కోరుతున్నారు.

కోర్టు కాంప్లెక్స్ కోసం స్థలం కేటాయించండి


స్థలాన్ని పరిశీలిస్తున్న సివిల్ జడ్జి, న్యాయవాదులు, రెవెన్యూ అధికారులు

పుట్టపర్తి టౌన్: జిల్లాలో కోర్టు కాంప్లెక్స్ సామూహిక భవన నిర్మాణాల నిమిత్తం అవసరమైన స్థలాన్ని సత్వరమే కేటాయించాలని జూనియర్ సివిల్ జడ్జి ముజీప్ పసవల సయ్యద్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం కప్పలబండ రెవెన్యూ పొలంలో ఎన్టీ చౌదరి లేఅవుట్ సమీపాన బార్ అసోసియేషన్ సభ్యులు రెవెన్యూ అధికారులతో కలసి స్థల పరిశీలన చేశారు. జడ్జి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో కోర్టు సామూహిక భవన నిర్మాణం కోసం 12 ఎకరాల భూమి అవసరమవుతుందన్నారు. ఇందుకోసం పుట్టపర్తి మండలం కప్పలబండ రెవెన్యూ పొలంలో ఎన్టీ చౌదరి లేఅవుట్‌లో స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. పారిశ్రామికవాడ సమీపంలో వివాదాలు లేని, మౌలిక సదుపాయాలు కలిగిన భూమిని కేటాయించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి, న్యాయవాదులు రాజేంద్రప్రసాద్‌రెడ్డి, లెక్కల యదుభూషణ్, చల్లా శేఖర్, భారతీరెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ మృతి బాధాకరం


మట్టి ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందజేస్తున్న సీడీపీఓ సరస్వతి

బత్తలపల్లి: యర్రాయపల్లి అంగన్‌వాడీ వర్కర్ వాసంతి ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమని సీడీపీఓ సరస్వతి అన్నారు. సోమవారం గ్రామానికి చేరుకున్న ఆమె వాసంతి మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మట్టి ఖర్చుల కోసం ప్రభుత్వం అందించే రూ.15 వేలను వాసంతి భర్త నారాయణస్వామికి అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వాసంతి బత్తలపల్లి ప్రాజెక్ట్ పరిధిలో అందరితోనూ కలివిడిగా ఉంటూ అధికారులతోనూ తలలో నాలుకలా ఉండేదన్నారు. వాసంతి మృతి తీరనిలోటు అన్నారు. ఆమె వెంట సూపర్‌వైజర్ దేవమణి, పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు ఉన్నారు.

ఘన నివాళి

అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్ వాసంతి మృతికి సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, ఉపాధ్యక్షులు మారుతి, సీఐటీయూ జిల్లా నాయకులు జేవీ రమణ, బత్తలపల్లి మండల కన్వీనర్ నరసింహులు, తదితరులు యర్రాయపల్లికి చేరుకుని, వాసంతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎల్.ఆదినారాయణ, అంగన్‌వాడీ లీడర్లు రజిత, అలివేలమ్మ, రజియా, సీపీఐ నాయకులు బండల వెంకటేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ కృష్ణవేణి

తాడిమర్రి: రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కృష్ణవేణి హెచ్చరించారు. మండల కేంద్రంలో పోలీసుస్టేషన్ ముందు సోమవారం ఆమె సిబ్బందితో కలసి వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని ఈ సందర్భంగా ఎస్ఐ సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపినా, ద్విచక్ర వాహనంలో ముగ్గురిని కూర్చోపెట్టుకుని వాహనం నడిపినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సూర్యనారాయణ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మీ అటాచ్ క్యాంపునకు ఎనిమిది మంది ఎంపిక


క్యాడెట్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ యూనిట్‌లో ఎనిమిది మంది క్యాడెట్లు ఆర్మీ అటాచ్ క్యాంపునకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం సదరు క్యాడెట్లను ప్రిన్సిపాల్ అభినందించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు లక్ష్మన్న, నిఖిల్, సాయి నిఖిల్, బాల ఓబులేసు, వెంకటసాయికృష్ణ, తృతీయ సంవత్సరం విద్యార్థులు పోతిరెడ్డి, ధనుష్, అహ్మద్ సికింద్రాబాద్‌లో 76 ఇన్‌ఫాంట్రీ బ్రిడ్జి ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 24 వరకు సాగే ఎన్‌సీసీ క్యాంపునకు ఎంపికయ్యారన్నారు. ఇలాంటి అరుదైన అవకాశం సొంతం చేసుకోవడం కళాశాలకు ఎంతో గర్వకారణమని తెలిపారు. ఈ పదిరోజుల క్యాంపు జీవితంలో అత్యున్నత స్థానానికి చేరడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. క్యాంపులో కర్నూలు గ్రూపు నుంచి 55 మంది క్యాడెట్లు ఎంపిక కాగా.. అందులో 8 మంది మన కళాశాల విద్యార్థులు కావడం ఎంతో గొప్ప విషయమని ఎన్‌సీసీ ఏఎన్‌ఓ లెఫ్టినెంట్ పావని, అధ్యాపకులు గోపాల్‌నాయక్ తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

అమడగూరు: గాజుబండ సమీపంలోని ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులకు శక్తి టీం పోలీసులు సైబర్ నేరాలు, పలు చట్టాలపై అవగాహన కల్పించారు. రక్షణ కోసం ప్రభుత్వం రూపొందించిన శక్తి యాప్ గురించి తెలియజేశారు. అత్యవసర సమయాల్లో 100, 112, 181, 1098, 1930 నంబర్లకు కాల్ చేయాలన్నారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు జరిపిస్తే, వధూ, వరులతో పాటుగా ఇరువురి తల్లితండ్రులు కూడా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడినా, ఈవ్ టీజింగ్‌లు చేసినా నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తారన్నారు. చిన్నారులపై దాడులు, అఘాయిత్యాలకు పాల్పడితే పోక్సో కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో జమేదార్లు రమణ, సుధాకర్, శక్తి టీం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీం ప్రతినిధులు

పుట్టపర్తి టౌన్: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని గోరంట్ల సీఐ శేఖర్ సూచించారు. సోమవారం గోరంట్ల సమీంలోని భారతీయ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నొవేషన్ యూనివర్సిటీ (బెస్ట్ ఇన్నొవేషన్ యూనివర్సిటీ)లో సీఐ ఆధ్వర్యంలో శక్తి టీం ప్రతినిధులు మాదకద్రవ్యాల దుష్ప్రభావం, ట్రాఫిక్ నియమాలు, పిల్లలపై వేధింపులు, మహిళల భద్రత, సైబర్ నేరాలు వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత మంచి, చెడులను గమనించి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, దేశాన్ని కాపాడే భారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. డ్రగ్స్ మహమ్మారిని మొక్కగా ఉన్నప్పుడే తుంచివేసే విధంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. డ్రగ్స్ బారినపడి చాలా కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య బోధించండి


ప్రిన్సిపాల్, అధ్యాపకులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగలింగారెడ్డి

ధర్మవరం అర్బన్: విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధించాలని ఆర్‌జేడీ డి.నాగలింగారెడ్డి సూచించారు. పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సోమవారం ఆర్‌జేడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. తరగతి గదుల్లోని విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఎఫ్‌ఆర్‌ఎస్, టీఎల్‌పీ, టీచింగ్ డైరీ తదితర బోధనా సంబంధిత అంశాలపై అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలపై ఉన్న నమ్మకంతో విద్యార్థులు చదువుకునేందుకు వస్తున్నారని, వారికి నాణ్యమైన విద్య అందించడమే కాకుండా అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దడంలో అధ్యాపకులు కీలకపాత్ర పోషించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ చిట్టెమ్మ, అధ్యాపకులు త్రివేణి, షమీవుల్లా, పావని, పుష్ప, ఆనంద్, మీనా, ధనుంజయ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

'స్టెమి'తో ప్రాణ రక్షణ

ధర్మవరం అర్బన్: అత్యవసర సమయంలో గుండె జబ్బు రోగులకు 'స్టెమి'తో ప్రాణ రక్షణ కల్పిస్తామని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్రనాయక్ తెలిపారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'స్టెమి' కార్యక్రమంలో భాగంగా గ్రూప్ క్రియేట్ చేశామన్నారు. గుండెజబ్బు లక్షణాలతో ఎవరైనా ఆస్పత్రికి వస్తే వారికి వెంటనే ఈసీజీ తీసి.. గ్రూపులో పంపిస్తామన్నారు. గ్రూపులో ఉన్న గుండెవైద్య నిపుణులు ఈసీజీని పరిశీలించి.. గుండెజబ్బు వచ్చిందా లేదా అని నిర్ధారిస్తారన్నారు. ఎవరికైనా గుండెజబ్బు వచ్చినట్లు నిర్ధారిస్తే వారికి వెంటనే ఆస్పత్రిలో ఉండే రూ.45 వేలు విలువ గల ఇంజక్షన్‌ను ఉచితంగా వేసి గుండెజబ్బు నుంచి ప్రాణాలను రక్షిస్తామని తెలిపారు. స్టెమి గ్రూపులో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రి, సవీర ఆస్పత్రి, పావని ఆస్పత్రుల గుండెవైద్య నిపుణులు ఉన్నారని పేర్కొన్నారు. ప్రజలు గుండె జబ్బు రాకుండా షుగర్, బీపీ తగ్గించుకోవాలని సూచించారు.